ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 49 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 2 జూన్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## మయన్మార్ అధ్యక్షుడితో ప్రధాని కీలక భేటీ

### ద్వైపాక్షిక బంధాలపై ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు!



**న్యూఢిల్లీ, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

భారత పర్యటనలో ఉన్న మయన్మార్ అధ్యక్షుడు యూ మిన్ ఆంగ్ హ్లైంగ్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక సమావేశం నిర్వహించారు. మయన్మార్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తన తొలి విదేశీ పర్యటన కోసం భారతదేశాన్ని ఎంచుకోవడం పట్ల ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ..మిగతా 2లో

## జమ్ముకశ్మీర్‌లో తగ్గిన ఉగ్రవాదం!

### మే నెలలో 'నో కిల్లింగ్స్'

### గత 30 ఏళ్లలో మొదటిసారి ప్రశాంతత!

### జమ్ముకశ్మీర్‌లో 4,011 నుంచి 12కు పడిపోయిన వార్షిక మరణాలుల

### ఉగ్రవాదం తగ్గిందా?



**జమ్మూకశ్మీర్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

జమ్మూకశ్మీర్‌లో మూడు దశాబ్దాల కంటే ముందు ప్రారంభమైన ఉగ్రవాదం నేటికీ రావణకాష్టంలా మండుతూనే ఉంది. భారత పౌరులు ఉగ్ర దాడులతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కానీ నేడు ఆ పరిస్థితి క్రమంగా మారుతోంది. జమ్మూకశ్మీర్‌లో ..మిగతా 2లో

## వర్షాకాలంలోపు డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు పూర్తి చేయాలి

### పంట మార్పిడి.. పంటల వైవిధ్యతపై రైతులకు అవగాహనకల్పించాలి...

### తాగు నీటికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు తలెత్తవద్దు...

### సమస్యల పరిష్కారంలో కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో సాగాలి

### వర్షాకాల సన్నద్ధత సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

ఎల్‌నినోప్రభావంతోవర్షాభావపరిస్థితులునెల కొంటాయనివాతావారణ శాఖ నివేదిస్తున్నందున కృష్ణా, గోదావరిజలాల్లోమన వాటా జలాలు దక్కేలాచూడాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎగువ రాష్ట్రాలు డ్యామ్‌లు నిండిన తర్వాతే నీళ్లు వదిలే విధానాన్ని పాటిస్తే మనకు ఇబ్బందులు ఎదురవుతాయని సీఎం పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొనేలా ఉన్నందున అంతరాష్ట్రజలాల్లో ప్రొరేటా ప్రకారం తెలంగాణకు రావాల్సిన వాటా జలాలు వచ్చేలా ఆయా రాష్ట్రాల అధికారులతో ముందుగానే చర్చించి తగిన కార్యాచరణ రూపొందిం చాలని సీఎం నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల వర్షాకాల సన్నద్ధతపై సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి సోమవారం సమీక్షనిర్వహించారు. మహారాష్ట్రలోని కోయనా డ్యామ్ నీటిని వంద శాతం జలవిద్యుదత్పత్తికే మహారాష్ట్రవినియోగిస్తోందని... ఆ మొత్తం నీటిని మనం తీసుకొని వారికి అవసరమైన విద్యుత్ సరఫరా చేసే దానిపై ఆ రాష్ట్ర అధికారులతో చర్చించాలని సీస్ రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. గోదావరినది నుంచి ఏటా వేల టీఎంసీల జలాలు సముద్రం పాలవుతున్నాయని... అయితే ఆ వరదంతా చాలా స్వల్ప కాలంలోనే వస్తోందని ముఖ్యమంత్రి అన్నారు.. ఈ నేపథ్యంలో ఇటు గోదావరి, అటు ప్రాణహితల వైపు నుంచి వచ్చే వరదను ఎలా మళ్లించాలనే దానిపై స్పష్టమైన విధానం రూపొందించాలని సీఎం సూచించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు నిర్మించిన సీలేరు, తుంగభద్ర డ్యామ్‌ల నుంచి ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో తెలంగాణకు రావాల్సిన వాటాపై నివేదిక రూపొందించాలని విద్యుత్ శాఖ అధికారులను ..మిగతా 2లో

## ఆదివాసీల సొంతింటి కల నెరవేరుస్తున్నాం

### ఆదిలాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### కొమురంబీమ్ జిల్లాలో సీఎం పర్యటన

### కొరారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ గృహప్రవేశంలో పాల్గొన్న సీఎం

### రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ ఆవిష్కరణ





**ఆదిలాబాద్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆదిలాబాద్ ఆదివాసీల సొంతింటి కల నెరవేరాలని ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేదలకు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కాగజ్‌నగర్‌లో పర్యటించిన సీఎం.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. తండాలు, గూడేల్లో ఉండే అర్హులైన ఆదివాసీ బిడ్డల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి నూరుశాతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి. గుడిసెలు లేని ఆదిలాబాద్ జిల్లాను నేను చూడాలనుకుంటున్నా. రాష్ట్రంలో సెప్టెంబర్ 17న మరో లక్ష గృహప్రవేశాలు చేస్తాం. కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఈ వేదిక నుంచే మంజూరు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నానని అన్నారు. కాళేశ్వరంలో పెట్టిన రూ. లక్ష కోట్లు గోదావరిలో ..మిగతా 2లో



## సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జిలు

### కేంద్రన్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల

**న్యూఢిల్లీ, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

సుప్రీం కోర్టులో ఐదుగురు కొత్త న్యాయమూర్తులను నియమించినట్లు కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ జాబితాలో సీనియర్ న్యాయవాది వి మోహన, ప్రస్తుతం బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, ప్రస్తుత పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు,ప్రస్తుత మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్ , జమ్మూకశ్మీర్ హైకోర్టు సీజే ..మిగతా 2లో

## క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలి

### హైదరాబాద్ సభపై పవన్ కల్యాణ్‌కు మంత్రి పొన్నం అల్టిమేటం

### క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలని డిమాండ్!

### హైదరాబాద్‌లో జనసేన 'నవనిర్మాణ సభ'

### తెలంగాణ ఏర్పాటును పవన్ తీవ్రంగా వ్యతిరేకించారన్న పొన్నం

### హైదరాబాద్‌లోనే పవన్ ఎందుకు సభ పెడుతున్నారని ప్రశ్న





**హైదరాబాద్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభ'పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే ఇక్కడ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును ..మిగతా 2లో



## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

### అమెరికా దళాల దాడులతో మొదటికొచ్చిన వ్యవహారం

**వాషింగ్టన్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

శాంతి ఒప్పందం ఓ కొలిక్కి వచ్చిందనుకొనేలోపే పశ్చిమాసియా మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. అమెరికా దళాలు ఇరాన్ లోని గురుక్ నగరం, ఖేష్మ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలపై దాడులు చేశాయి. ఆత్మరక్షణ కోసం ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అంతర్జాతీయ జలాలపై ..మిగతా 2లో

# ఆదివాసీల సొంతింటి కల నెరవేరుస్తున్నాం

**మొదటి పేజీ తరువాయి...**

కలిసిపోయాయి. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను పట్టించుకోలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశాను. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్ర సీఎంకు ఎందుకుంత చిన్నచూపు అని అన్నారు. సమస్య పరిష్కరించడానికి కిషన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని మరోమారు డిమాండ చేశారు. పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని 7 గ్రామాలను ఏపీలో కలపలేదా? తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని భరిస్తాం. మహారాష్ట్ర నుంచి 2వేల ఎకరాలు మాత్రమే అడుగుతున్నాం అని అన్నారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇండ్లను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కొమురం భీం జిల్లాలో పర్యటించిన సీఎం.. కోలామ్ ఆదివాసీ బిడ్డల ఇందిరమ్మ గృహప్రవేశాలు చేయించారు. కొత్తగూడలో 25 ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాల సందర్భంగా.. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్ల గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. కోలామ్ ఆదివాసీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిన విషయం తెలిసిందే. గృహ ప్రవేశం సందర్భంగా కొత్త ఇందిరమ్మ ఇంట్లో ఆదివాసీలతో కలిసి ఇప్పపువ్వు లడ్డు తిన్నారు సీఎం. గృహ ప్రవేశం సందర్భంగా ఆడబిడ్డలకు పట్టు బట్టలు అందించారు.. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రూ.112.14 కోట్లతో అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. చింతల మానేపల్లిలో 132/3 కేవీ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు.కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 18 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. నియోజవర్గానికి 3 వేల 500 ఇండ్ల చొప్పున మొదటి విడత 4 లక్షల 50 వేల ఇండ్లు ఇచ్చాం అని సిఎం అన్నారు. ఆ లెక్కన ఇస్తే గూడేలలో ఉన్న ఆదివాసీలకు అందరికీ ఇవ్వలేమనే అభ్యర్థన వచ్చిందని, అందుకే ఆదివాసీ ప్రాంతానికి, గూడేలలో ఉన్న ఆదివాసీలు నివసించే

ప్రాంతంలో ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఇచ్చిన 4 లక్షల 500 ఇండ్లు కాకుండా.. గూడేలకు ప్రత్యేకంగా 21 వేల ఇండ్లు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా మళ్లీ కొత్త సంకల్పం తీసుకుంటున్నాం. రాష్ట్రం మొత్తం లో ప్రారంభించే ఇండ్లకు ఆదివాసీ ప్రాంతం నుంచే లక్ష ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టామని అన్నారు. మళ్లీ అదనంగా రెండున్నర లక్షల ఇండ్లు ఇచ్చేందుకు ఈ ప్రాంతంనుంచే శ్రీకారం చుడుతున్నాం అన్నారు. లక్షల 50 వేల ఇండ్లకు అదనంగా రెండో విడతలో మరో రెండు లక్షల ఇండ్లు ఇస్తామన్నారు. మొదటి ప్రాధాన్యత ఆదివాసీ గూడేలలో గుడెసెల్లో ఉన్నోళ్లకు, లంబాడీ తండాల్లో ఉన్న గుడిసెల్లో ఉన్న వాళ్లకే ఇండ్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 62లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేశాం. మొత్తం 75లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటాం. జూన్ 15 నాటికి ఈ కొనుగోళ్లు పూర్తవుతాయి. మేం సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్రం కొనాలి. దీనికి కిషన్‌రెడ్డి సహకారం అందించాలి. వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధం చేస్తాం అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.



# జమ్ముకశ్మీర్‌లో తగ్గిన ఉగ్రవాదం!

**మొదటి పేజీ తరువాయి...**

ఉగ్రవాదం మొదలైనప్పటి నుంచి నేటి వరకు చూసుకుంటే, మొదటిసారిగా ఈ మే నెలలో ఉగ్రవాద సంబంధిత మరణాలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. అధికారిక గణాంకాల ప్రకారం, 2026 మొదటి 5 నెలల్లో కేవలం 12 ఉగ్రవాద సంబంధిత మరణాలు మాత్రమే నమోదు అయ్యాయి. ఈ మృతుల్లో 9 మంది ఉగ్రవాదులు కాగా, మన భద్రతా దళ సిబ్బందికి చెందిన ఒకరు, గుర్తింపు వివాదం ఉన్న ఒక స్థానికుడు, గుర్తు తెలియని వ్యక్తి ఉన్నారు. కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు ఉగ్రదాడుల్లో సాధారణ పౌరులు ఎవరూ మరణించలేదు. జమ్మూకశ్మీర్ పోలీస్ డేటా ప్రకారం, 2000 మే నెలలో అక్కడ 288 ఉగ్రవాద సంబంధిత మరణాలు నమోదు అయ్యాయి. 2001 మే నాటికి ఈ సంఖ్య 300కు చేరింది. వాస్తవానికి ఆ సమయంలో కశ్మీర్ లోయ అంతటా, జమ్మూలోని కొన్ని ప్రాంతాల్లో ఉగ్రవాదులు, పౌరులు, భద్రతా సిబ్బంది పెద్ద సంఖ్యలో మరణించారు. దాదాపు ప్రతిరోజూ అక్కడ ఈ ఉగ్రవాద సంబంధిత మరణాలు సంభవించాయి. అయితే కాలక్రమేణా అక్కడ ఉగ్ర హింస క్రమంగా తగ్గుతూ వస్తున్నప్పటికీ, మే నెల మాత్రం అత్యంత హింసాత్మక మాసంగా ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

**మొదటి పేజీ తరువాయి...**

ప్రయాణిస్తున్న తమ ఎంక్యూ1 డ్రోన్‌ను కూల్చివేయడం, ఇతర దుందుడుకు చర్యలకు ప్రతిస్పందనగానే తాము ఈ దాడి చేసినట్లు వెల్లడించింది. తమ దాడిలో ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, గ్రౌండ్ స్టేషన్, రెండు అటాక్ డ్రోన్లు ధ్వంసమైనట్లు పేర్కొంది. వీటి నుంచి తమ యుద్ధ నౌకలకు ముప్పు పొంచి ఉన్నట్లు తెలిపింది. సిరిక్ ద్వీపంలోని టెలికామ్ టవర్స్‌పై అమెరికా దాడి చేసిందని ఇరాన్ ఐఆర్‌జీసీ వెల్లడించింది. దీనికి ప్రతిగా అగ్రరాజ్యం దాడికి వాడిన ఎయిర్‌బేస్‌ను తాము లక్ష్యంగా చేసుకొన్నామని ప్రకటించింది. ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ÷టైర్స్ ప్రతిదాడి చేశారని తెలిపింది. కానీ, ఏ బేస్‌పై దాడి చేశారో మాత్రం వెల్లడించలేదు. అయితే అంతకు కొన్ని గంటల ముందు కువైట్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ దాడులను గుర్తించి యాక్టివేట్ అయినట్లు వార్తలొచ్చాయి. హర్మూజ్‌ను నియంత్రించాలంటే ఇరాన్ ఖేష్మ్ మిసైల్ సిటీని కూడా ధ్వంసం చేయడం అమెరికాకు చాలా ముఖ్యం. ఇక్కడ అండర్‌గ్రౌండ్ సిటీలో యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులు ఉన్నాయి. జలసంధిలోని నౌకలను లక్ష్యంగా చేసుకోవడం కోసం వీటిని వాడతారు. గడా 380, హెచ్‌వై-2 సిల్క్‌వార్మ్‌ను ఇరాన్ ఇక్కడ సిద్ధంగా ఉంచింది. ఇక బాలిస్టిక్

క్షిపణుల్లో 800 కిలోమీటర్ల రేంజ్ ఉన్న ఖియామ్-1, ఖైబర్ షెకన్, ఘద్ర, ఎమాద్ మిసైల్స్‌ను భద్రపర్చింది. వీటితోపాటు వేగంగా దాడి చేసే స్పీడ్‌బోట్స్, తీరప్రాంత క్షిపణి బ్యాటరీలు కూడా ఉన్నాయి.

# క్షమాపణ చెప్పాకే అడుగుపెట్టాలి

**మొదటి పేజీ తరువాయి...**

గతంలో పవన్ కల్యాణ్ తీవ్రంగా వ్యతిరేకించారని మంత్రి పొన్నం గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం ముట్టలేదని పవన్ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ... అసలు ఏ నైతిక హక్కుతో ఆయన హైదరాబాద్‌లో ఇంత పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. "తెలంగాణ దృష్టి పడితే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతాయి" అంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, భావాలను తీవ్రంగా గాయపరిచాయని పొన్నం మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై పవన్ సమాధానం చెప్పి తీరాలన్నారు. తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం, ఇక్కడి ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ద్వేషాన్ని నింపేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక బీజేపీతో పవన్‌కు ఉన్న 'తెరవెనుక ఒప్పందం' స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ సభ నిజంగా అభివృద్ధి కోసమే అయితే గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో పెట్టుకోవచ్చు కదా... కేవలం హైదరాబాద్‌లోనే ఎందుకు పెడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. ఏపీ ప్రజలు పవన్‌కు బాధ్యతాయుతమైన పదవి ఇచ్చారని, తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా... వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి ఆంధ్రప్రదేశ్ సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు.

# ముందు నీ అమరావతి కట్టుకో

## పవన్ కళ్యాణ్‌పై కవిత ఘాటైన వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. మంగళవారం ( జూన్ 2 ) తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ నవ నిర్మాణ సభ పేరుతో టీజీ జనసేన నేతలతో పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఈ క్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని అన్నారు కవిత. టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని.. ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నామని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు కవిత. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు కవిత. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు. ఇదిలా ఉండగా మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పవన్ కళ్యాణ్ పై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.

# పవన్‌కల్యాణ్ సభ అనుమతి నిరాకరించిన పోలీసులు

**హైదరాబాద్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర రాజధాని ఐటీ హబ్ గచ్చిబౌలిలో జనసేన పార్టీ నిర్వహించ తలపెట్టిన 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ - జనసేన సాధక్ సమ్మేళనం' పేరుతో నిర్వహించే కార్యక్రమానికి భద్రతా కారణాల దృష్ట్యా సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. జూన్ 2వ తేదీన గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవగా, చివరి నిమిషంలో పోలీసుల నుంచి ఎదురైన ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అనుమతి ఇవ్వలేం : జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ఈ సభ నిర్వహణకు అనుమతి కోరుతూ పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 2న మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుమారు 2,000 మంది ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఈ అంతర్గత సమావేశాన్ని నిర్వహించాలని పార్టీ భావించింది. అయితే, ఈ విజ్ఞప్తిని పరిశీలించిన శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీనివాస్ సభకు అనుమతి ఇవ్వడం కుదరదంటూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడి కేసులతో ఇక్కడ సమస్యలు : ఆంధ్రప్రదేశ్‌లో ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ వ్యాఖ్యలపై నమోదైన కేసులు, వాటి కారణంగా తెలంగాణలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు, అలాగే కొందరు ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకులు చేసిన వ్యాఖ్యల వల్ల తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని దర్యాప్తులో తేలిందన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, వ్యతిరేక ఆందోళనలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా ఈ సమావేశం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సమయంలో జరగనుండటంతో, భారీ స్థాయిలో నిరసనలు, ప్రదర్శనలు, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని డిసిపి పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో సమావేశం నిర్వహిస్తే శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని వెల్లడించారు. పార్కింగ్ కూడా సరిగా లేదు : మరోవైపు, సమావేశానికి వచ్చే సుమారు 2 వేల మంది కోసం సరిపడా పార్కింగ్ సదుపాయం లేదని వేదిక యాజమాన్యం ధృవీకరించిందన్నారు.

# మయన్మార్ అధ్యక్షుడితో ప్రధాని కీలక భేటీ

**మొదటి పేజీ తరువాయి...**

సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు వివిధ కీలక రంగాల్లో సహకారాన్ని పెంపొందించే అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు.మయన్మార్ అధ్యక్షుడు తన భారత పర్యటనను బోధ్‌గయలో భగవాన్ బుద్ధుని ఆశీస్సులతో ప్రారంభించడం విశేషం. ఈ అంశాన్ని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఇది ఇరు దేశాల మధ్య ఉన్న సాంస్కృతిక బంధానికి నిదర్శనమని, భారతీయులందరికీ ఇది ఎంతో సంతోషాన్ని కలిగించే విషయమని కొనియాడారు.భారతదేశం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే 'నేబర్‌హుడ్ ఫస్ట్', 'యాక్ట్ ఈస్ట్', ఇండో-పసిఫిక్ వ్యూహాత్మక విధానాల్లో మయన్మార్ అత్యంత కీలకమైన భాగస్వామి అని ప్రధాని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో భారత్-మయన్మార్ సంబంధాలకు సంబంధించిన అన్ని అంశాలపై ఇరు దేశాల ప్రతినిధులు సమగ్ర సమీక్ష జరిపినట్టు ప్రదాని మోదీ తెలిపారు.

పలు కీలక రంగాల్లో సహకారంపై విస్తృత చర్చలు.. భారత్, మయన్మార్ మధ్య బంధాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్లేందుకు పలు రంగాల్లో సహకారాన్ని మరింత విస్తృతం చేయాలని ఇరువురు నేతలు అంగీకారానికి వచ్చారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవడంతో పాటు, ఆధునిక సాంకేతికతకు ఎంతో కీలకమైన రేర్ ఎర్త్స్ రంగంలో పరస్పర సహకారంపై ప్రత్యేకంగా చర్చించారు. ఇరు దేశాల సరిహద్దు కనెక్టివిటీని మెరుగుపరచడం, హెల్త్‌కేర్ (ఆరోగ్య సంరక్షణ), సామర్థ్య పెంపుదల, చారిత్రాత్మక వారసత్వ కట్టడాల పునరుద్ధరణ వంటి అంశాలపై కార్యాచరణను సమీక్షించారు. ప్రాంతీయ స్థిరత్వమే లక్ష్యంగా అత్యంత కీలకమైన సముద్ర తీర భద్రత, సైబర్ సెక్యూరిటీ వంటి రక్షణ రంగ అంశాలలో ఇరు దేశాలు కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించాయి.

# సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జిలు

**మొదటి పేజీ తరువాయి...**

జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. ఇటీవలే సీజేఐ నేతృత్వంలోని కొలీజియం వీరి పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వీరిలో వి. మోహన ఒక్కరే సీనియర్ న్యాయవాది. న్యాయవాది మోహన 1988లో కోయంబత్తూరు లా కాలేజీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అయిదేళ్ల లా డిగ్రీ మొదటి బ్యాచ్ విద్యార్థి. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్‌ల వద్ద జూనియర్‌గా ఉన్నారు. 1996లో ఏఓఆర్ పరీక్ష పాసైన తర్వాత ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. వివిధ కేసుల్లో సీనియర్ న్యాయవాదులు కపిల్‌సిబల్, కె.కె.వేణుగోపాల్, పి.చిదంబరం, అరున్‌జైట్లీ, అంద్యార్జునలతో కలిసి పనిచేశారు. 2015 ఏప్రిల్ 23న సీనియర్ న్యాయవాది హోదా పొందారు. ఈమె చేరికతో సుప్రీం కోర్టులో మహిళా జడ్జిల సంఖ్య 2కు చేరినట్లయింది.

# వర్షాకాలంలోపు డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు పూర్తి చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సీఎం ఆదేశించారు. డ్యామ్‌ల మెయింటెనెన్స్‌పై ముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. గతంలోకడెం ప్రాజెక్టులో తలెత్తిన ఇబ్బందులను సీఎం గుర్తు చేశారు. గేట్ల మరమ్మతులు, మెయింటెనెన్స్‌లకు సంబంధించి ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేశామని ఆర్థిక శాఖ అధికారులు ముఖ్యమంత్రికితెలియజేశారు. ఎన్ని నిధులు అవసరమైనా వెంటనే విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. ఈ వర్షాకాలంలో ఎక్కడైనా డ్యామ్‌ల విషయంలో ఇబ్బందులు తలెత్తితే అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి హెచ్చరించారు. వాతావరణ శాఖ అంచనాలు, నివేదికల ఆధారంగా పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంటల మార్పిడి, పంటల వైవిధ్యత, తక్కువ నీరు వినియోగించుకునే పంటలు, పంట రకాల సాగుపై రైతులకు రైతు వేదికల నుంచి అవగాహనకల్పించాలని సీఎం సూచించారు. ఈ విషయంలో ఏఐ టెక్నాలజీతో రూపొందించిన వీడియోలను ప్రదర్శించాలని సీఎం తెలిపారు. టీవీ ఛానెళ్లలోనూ ఇందుకు సంబంధించిన ప్రసారాలు అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పంటలసాగుతో పాటు అవసరమైనవిత్తనాలు, ఎరువుల సరఫరాలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. రామగుండం ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అయ్యే యూరియా అంతా తెలంగాణకే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతేడాది వరదల సమయంలో కామారెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో తాను క్షేత్ర స్థాయిలో పర్యటించినసమయంలో ఇచ్చిన హామీల అమలుపై అధికారులనుముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నాడు ఇచ్చిన హామీలు.. వాటి ప్రస్తుతపరిస్థితి.. ఏవైనా నెరవేరకుంటే అందుకు కారణాలతో తనకు నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. హామీల అమలులో నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విపత్తుల సమయంలో విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం సూచించారు. వడగాలులు, వరదల సమయంలోప్రజలు ప్రాణాలు, ఆస్తులు కోల్పోయినప్పుడువెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి బాధిత కుటుంబాలకు పరిహారం అందేలా చూడాలన్నారు. వరదలసమయంలోదెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, కూలిన వంతెనల స్థానంలో నూతనవంతెనల నిర్మాణం, ఇతరపనులకువిపత్తునిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వ్యయం చేయాలని సీఎం సూచించారు. క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వర్షాకాలంలో రోడ్ పైవరద నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. నీరు నిలిచే 141ప్రదేశాలను గుర్తించి వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించాలని గతంలో నిర్ణయించామని, వాటి పురోగతిపైముఖ్యమంత్రిఅధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే11వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పూర్తి చేశామని, మిగతా వాటి పనులుకొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఆ పనులుయుద్ధప్రాతిపదికనచేపట్టాలని.. వాటి పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీనియర్ అధికారి జయేశ్రంజన్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. వర్షాకాలంలో నగరంలో సమస్యలపరిష్కారానికి మూగ్గురుకమిషనర్లు, మూడు నగరాల పోలీస్ కమిషనర్లుసమన్వయంతో ముందుకు సాగాలని సీఎం సూచించారు. వర్షాభావపరిస్థితులునెలకొన్నాహైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో ఏ ప్రాంతాలోనూ తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతానికి ఎటువంటి ఇబ్బందులు లేవని అధికారులు సీఎంకు తెలియజేశారు. పరిస్థితికితగినట్లు తాగు నీరు, విద్యుదుత్పత్తి, సాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి కేటాయింపులు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ వర్షాకాలానికి అవసరమైన సామగ్రిని ముందుగానే సమీకరించుకోవాలని సీఎం సూచించారు. గాలిదుమ్ములు, భారీ వర్షాలతోట్రాన్స్‌ఫార్మర్లుదెబ్బతిన్నపుడు, లైన్లు తెగిపోయి సరఫరా నిలిచినప్పుడు తక్వణమే స్పందించి మరమ్మతులు పూర్తి చేసి సరఫరానుపునరుద్ధరించాలని ఆదేశించారు. జిల్లాల స్థాయిలో కలెక్టర్లు, ఎస్పీలు నిర్ణీత సమయంలో భేటీ అవుతూ ఉండాలనిముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో ముందుకు సాగితే ప్రజాసమస్యలుపరిష్కారమవుతాయన్నారు. రాష్ట్ర స్థాయితో పాటు జిల్లా, మండల స్థాయిలోనూ రెవెన్యూ, పోలీసు, వైద్యారోగ్య, విద్యుత్, పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే సమస్యలన్నీపరిష్కారమవుతాయని సీఎం అన్నారు.

# ప్రేమావతిపేట మోడల్ మార్కెట్‌ను పునరుద్ధరించాలి






**ప్రజాధనం వృధా కాకుండా చూడాలి..**

**కామన్ ప్లాట్ ఫాం ఎన్జీఓ క్రాంతివర్మ**

**రాజేంద్రనగర్,జూన్01(ప్రభాత ఉదయం)**

ప్రేమావతిపేట మోడల్ మార్కెట్ ను పునరుద్ధరించాలని,ప్రజాధనం వృధా కాకుండా చూడాలని కామన్ ప్లాట్ ఫాం ఎన్జీఓ క్రాంతివర్మ అన్నారు.తొమ్మిదేళ్లుగా మూతపడడటంతో కోట్ల ప్రజాధనం వృథా అవ్వడమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు ఆయన మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కోట్లాది రూపాయల ప్రజాధనంతో 9సంవత్సరాల క్రితం రాజేంద్రనగర్ ప్రేమావతిపేటలో అత్యాధునిక వసతులతో నిర్మించిన మోడల్ మార్కెట్ ఇప్పటివరకు తెరవకపోవడం పట్ల స్థానిక ప్రజలు,స్వచ్ఛంద సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయన్నారు.ప్రజల సౌకర్యం కోసం కట్టిన ఈ భవనం నేడు దుమ్ము,ధూళితో శిథిలావస్థకు చేరిందన్నారు.తాళాలు వేసి ఉండడం వల్ల వెలుతురు,నిర్వాహణ లేక చిమ్మచీకటిగా మారి మందుబాబులకు,అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందన్నారు.ఇది ప్రజాధనాన్ని వృథా చేయడమే కాకుండా, ప్రజా భద్రతకు ముప్పుగా పరిణమించిందని ఆవేదన వ్యక్తం చేశారు.మార్కెట్ అందుబాటులో లేకపోవడంతో స్థానిక చిరు వ్యాపారులు,కూరగాయల విక్రయదారులు రోడ్లపైనే అమ్మకాలు సాగిస్తున్నారన్నారు.దీనివల్ల నిత్యం ట్రాఫిక్ జామ్‌లు,రోడ్డు ప్రమాదాలు,చైన్ స్నాచింగ్‌లు,సెల్‌ఫోన్ దొంగతనాలు విపరీతంగా పెరిగాయని స్థానికులు వాపోతున్నారని తెలిపారు.ఈ మోడల్ మార్కెట్ చుట్టూ వ్యవసాయ విశ్వవిద్యాలయం,ఉద్యాన విశ్వవిద్యాలయం,పశువైద్య విశ్వవిద్యాలయంతో పాటు పలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్నారు.రోజూ వేలాది మంది విద్యార్థులు,ఉద్యోగులు ఇక్కడ రాకపోకలు సాగిస్తారన్నారు.ఈ మార్కెట్ తెరిస్తే వీరందరికీ ఎంతో మేలు జరుగుతుందన్నారు.ఉన్న అన్ని అడ్డంకులను తొలగించి మార్కెట్‌ను వెంటనే తెరవాలని,స్థానిక తోపుడు బండి వారు,కూరగాయల విక్రయదారులకు తక్కువ అద్దెకు షాపులు కేటాయించాలని,9 ఏళ్ల జాప్యానికి కారణమైన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని,

అధికారులు,ప్రజాప్రతినిధులు,వ్యాపారులతో కమిటీ వేసి పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.



క్రీడకారులతో వెంకటపతి రాజు.

# విద్యతో పాటుతో పాటు క్రీడలు ఎంతో అవసరం

**మాజీ భారత క్రికెటర్ వెంకటపతి రాజు**

**రాజేంద్రనగర్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

విద్యార్థులను విద్య తో పాటు క్రీడలలో రాణించడానికి తమ తల్లిదండ్రులు ప్రోత్సహించాలని భారత మాజి క్రికెటర్ వెంకటపతి రాజు పేర్కొన్నారు.సోమవారం కాటేదాన్ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ని సందర్శించారు.స్థానిక నాయకులు పి సంతోష్ గౌడ్, సమాజ సేవకులు సానెం రాజుగౌడ్ వారిని శాలువాతో సన్మానించారు. అనంతరం వెంకటపతి రాజు మాట్లాడుతూ... విద్యార్థులు ఎక్కువగా క్రికెట్ను ఆస్వాదిస్తున్నారని, ఒలంపిక్స్లో అనేక క్రీడలు ఉన్నయి,వాటిపై కూడా ఫోకస్ చేసి నేర్చుకోవాలని అన్నారు. చిన్న నాటి నుండే క్రికెట్ పట్ల శ్రద్ధ ఉన్న వారిని ప్రోత్సహించి శిక్షణకు పంపించాలని కోరారు.ఒక క్రికెట్ కాకుండా వారికి నచ్చిన క్రీడలలో ఆడించి నేషనల్ లేవల్లో గుర్తింపు వచ్చే విధంగా చూడాలని తెలిపారు.గెలుపు ఓటములు అందరికి సహజమే, క్రీడలలో ఆసక్తి చుపే వారిని ప్రోత్సహించండని అన్నారు. జీహెచ్ఎంసీ ఇలాంటి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం వలన క్రీడాకారులను గుర్తించిన వారవుతారని అన్నారు.బాడ్మింటన్, కిక్ బాక్సింగ్, స్కేటింగ్ వంటి ఆటలు ఉన్నయాని తొందరలోనే బాక్స్ క్రికెట్, పికిల్ బాల్, వంటి క్రీడలు రానున్నాయనిస్పోర్ట్స్ కాంప్లెక్స్ గేమ్ ఇన్స్పెక్టర్ మునీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి.సంతోష్ గౌడ్, సానెం రాజుగౌడ్, మహేందర్, సురేందర్ చౌదరి, సాకెత్, కిక్ బాక్సింగ్ కోచ్ లు నర్సింగ్ ,కిరణ్ తదితరులు ఉన్నారు.




కేతి బచావో కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

## కేతి బచావోపై అవగాహన కార్యక్రమాలు

**బుద్వేల్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**


ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐఐఆర్ఆర్) ఆధ్వర్యంలో సోమవారం కేతి బచావో కార్యక్రమాన్ని చేపట్టింది. ఆ సంస్థ ఇంచార్జి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ లోని సంస్థ కార్యాలయం అవరణలో ప్రారంభించారు. నేల ఆరోగ్య పరిరక్షణ, వనరుల సమర్థ వినియోగం, సుస్థిర వ్యవసాయ విధానాల ప్రోత్సాహం లక్ష్యంగా భారతీయ వరి పరిశోధన సంస్థ ఈ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. అందులో బాగంగా చేగూరు లోని కన్హా శాంతి వనం లోని హరి విశ్వవిద్యాలయం లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు మట్టి పరీక్షల ప్రాముఖ్యత, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి పొదుపు పద్ధతులు, సహజ వనరుల సంరక్షణపై అవగాహన కల్పించారు. సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ బ్రజేంద్ర, డాక్టర్ బందెప్ప, డాక్టర్ పాపారావు, డాక్టర్ ఎస్ కవి రాజు, లు పాల్గొని రైతులతో శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై చర్చిం చారు. హరి విశ్వవిద్యాలయం అధికారి డాక్టర్ నర్సిరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.



# దేశ భక్తి, సేవా భావం, ఐక్యతతోనే బలమైన భారత దేశం నిర్మాణం: స్వామి జీ

**బుద్వేల్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

ధర్మాన్ని రక్షించడం అంటే కేవలం ఆచారాలను కాపాడుకోవడం కాదని, మన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు, జాతి గౌరవాన్ని పరిరక్షించడం, సమాజంలో ఐక్యత, సేవాభావం దేశభక్తి పెరిగినప్పుడే బలమైన భారత దేశం నిర్మితమౌతుందని శ్రీ మత్ అన్నపూర్ణేశ్వరీ కాశీ విశ్వనాథ పీఠాధిపతులు శ్రీ దుర్గానందపురి స్వామిజీ అన్నారు. మైలార్దేవుపల్లి డివిజన్ మధుబన్ కాలనీ చౌరస్తా లో ఆదివారం సాయంత్రం జరిగిన హింధు సమ్మేళనం లో ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగిం చారు. విశ్వహింధు మాస పత్రిక సంపాదకులు కసిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి ప్రపంచానికి మార్గదర్శకమని, యువత తమ మూలాలను గుర్తుంచుకుని ధర్మం, సంస్కృతి, జాతియత పట్ల అంకిత భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హిందు సమ్మేళనం నిర్వహణ కమిటీ అధ్యక్షులు బొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, హింధు సమాజంలో సేవాభావం, ఐక్యత, సంస్కృతి పరిరక్షణ, యువత లో జాతీయ చైతన్యం పెంపొందించడమే ఈ



హిందూ సమ్మేళనాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న స్వామీ జీ



సమ్మేళనంలో పాల్గొన్న భక్తులు

సమ్మేళనం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సమాజ హితం కోసం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం మంచిదన్నారు. ఉదయం 8 గంటలకు మధుబన్ కాలనీ పురవీధులలో నిర్వహించిన భారీ ర్యాలీ లో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జై శ్రీరాం నినాధాలతో వీధులన్ని మార్మోగాయి, జై శ్రీరామ్ నినాధాలు, భగవద్వాజాలు, దేశ భక్తి గీతాలు, భక్తి గీతాలతో మధుకాలనీ పరిసర ప్రాంతాలు ధర్మ చైతన్యంతో మార్మోగాయి, సమ్మేళనంలో నిర్వాహణ కమిటీ ప్రధాన కార్యదర్శి దానోజు శ్రీనివాస్, కోశాధికారి అడికే కిశోర్ కుమార్, ఉపాధ్యక్షులు సి బుచ్చిరెడ్డి, సీతారాం పాండు, దొంత రాజు, సంయుక్త కార్యదర్శులు ఉత్తమ్, బాలస్వామి, రాజవర్ధన్ రెడ్డి , లక్ష్మణ్, ఉప కోశాధికారి చైతన్య, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు గంజి వెంకటేశ్, ఎల్లప్ప, సతీశ్, మీడియా కో ఆర్డినేటర్లు నందకిశోర్, విజయ్, కల్చరల్ కో ఆర్డినేటర్లు లక్ష్మి, గాయత్రి, సలహదారులు మసున వెంకటేశ్, మునగపాటి చంద్రయ్య, గోవింద్ రాజ్, సామల యాదయ్య, ఎస్. మహిపాల్, పోశెట్టి, మొగిలి క్రిష్ణ తో పాటు పలువురు పాల్గొన్నారు.



జన ప్రియ మార్వెల్ అపార్ట్ మెంట్ మూడవ అంతస్తు లో పొగలు

# హైదర్‌గూడ జనప్రియ మార్వెల్ అపార్ట్మెంట్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం

**బుద్వేల్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

హైదర్ గూడ జనప్రియ మార్వెల్ అపార్ట్మెంట్ లోని ఓ ప్లాట్ లో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలను రాజేంద్రనగర్ ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ చంద్రా నాయక్ వెల్లడించారు. అపార్ట్మెంట్ లోని మూడవ అంతస్థు ప్లాట్ నెంబర్ 305 లో సందీప్, రేఖ లు నివాసం ఉంటారు. వారు పూజ గది లో పూజలు చేసి దీపం ముట్టించి డ్యూటీలకు వెళ్లిపోయారు. ఉదయం 11 గంటలకు మూడవ అంతస్థులోని తాళం వేసిన ఆ ప్లాట్ లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. భయాందోళనలకు గురైన పక్క ప్లాట్ల నివాసులు బయటకు పరుగులు తీశారు. పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ ఫైర్ సేఫ్టీ ఆపీసర్ చంద్రా నాయక్ తమ సిబ్బంది చేత మంటలను ఆర్పివేసారు. ప్రమాదవశాత్తు దీపం కారణంగా మంటలు చెలరేగి పూజ గది, కిచెన్ పూర్తిగా కాలిపోయాయి. ప్లాట్ లోని ఇతర గదులు స్వల్పంగా దెబ్బదిన్నాయి. ఈ సంఘటన పై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తమ సోదరీ మరణానికి ఆసుపత్రి డాక్టర్లు కారణమని పోలీసులకు ఫిర్యాదు

**బుద్వేల్, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

తమ సోదరీ మరణానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఓ వ్యక్తి అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... చింతల్మెట్ ప్రాంతానికి చెందిన తాహెరా బేగం (21) మెడ నొప్పితో చాలా రోజులుగా బాధ పడుతుంది. ఆమె చింతల్మెట్ లో ఉన్న కోర్ హస్పిటల్ లో చికిత్స పొందుతుంది. రెండు రోజుల క్రితం ఆమె కు మెడ నొప్పి రావడంతో ఆసుపత్రికి వెళ్లింది. పరీక్షించిన వైద్యులు బలహీనంగా ఉండటం వల్లే మెడనొప్పి వస్తుందని చెప్పి ఇంజక్షన్ ఇచ్చి ఇంటికి పంపించి వేశారు. తిరిగి ఆమెకు మెడనొప్పి రావడంతో కుటుంబ సభ్యుల ఆమెను ఆదివారం ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన డాక్టర్లు రెండు సెలైన్లు ఎక్కించి ఇంటికి పంపించివేశారు. ఇంటి వద్ద ఆమె స్పందించకపోవడంతో సోమవారం ఉదయం ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే ఆమె మరణించిందని డాక్టర్లు తెలిపారు. దీంతో మృతురాలు తాహేరా బాగం సోదరుడు సోహెల్ అక్తర్ అతా పూర్ పోలీసులకు పిర్యాదు చేశాడు. తమ సోదరీ మరణానికి ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఫిర్యాదు లో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేధిక ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తామని ఇన్స్పెక్టర్ కె నాగేశ్వర్ రావు తెలిపారు.


# ఆర్థిక ఇబ్బందులతో బట్టల దుకాణం నిర్వాహకుడు ఆత్మహత్య

**బుద్వేల్ ,జూన్ 1 (ప్రభాత ఉదయం)**



శ్రీ సాయిలు

ఆర్థిక ఇబ్బందులతో బట్టల వ్యాపారం చేసే ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మైలార్దేవుపల్లి ఇన్స్ పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి...... లక్ష్మీగూడ లో నివాసం ఉండే శ్రీ సాయిలు (35), మౌనిక లు భార్యభర్తలు. వీరికి పది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీ సాయిలు కు కాటేదాన్ లో బట్టల దుకాణం ఉం ది. దుకాణం సరిగ్గా నడకపోవడం తో అప్పులు చేశాడు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీ సాయిలు ఆదివారం రాత్రి ఇంటి కిటికి కి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం భార్య మౌనిక లేచి చూసే సరికి మరణించి పడి ఉన్నాడు. మైలార్ దేవుపల్లి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చ్యురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

# ఆరాంఘర్ నుంచి జూపార్కు వరకు ఉన్న ఫ్లై ఓవర్ క్రింద పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**బుద్వేల్, జూన్ 1 (ప్రభాత ఉదయం):**

ఆరాంఘర్ చౌరస్తా నుంచి జూ పార్కు వరకు గల ఫ్లైవర్ క్రింద బాగంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులను కోరారు. జోన్ ఇంచార్జి ఎస్ఈ నరేందర్ గౌడ్ తో కలసి ఆయన ఫ్లై ఓవర్ క్రింద జరుగుతున్న పనులను సోమవారం పరిశీలించారు. ఫై ఓవర్ క్రింద ఇరువైపుల ఉన్న సర్వీస్ రోడ్డను, ర్యాంపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, టౌన్ ప్లానింగ్, యూబీడీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశాలు..

### ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**శంషాబాద్,జూన్01(ప్రభాత ఉదయం)**





ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని,అందులో భాగంగానే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను అందించడం జరిగిందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల గృహప్రవేశాల ఉత్సవం శంషాబాద్ మండలంలో ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా సోమవారం శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై,లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వయంగా రిబ్బన్ కట్ చేసి,సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారుల కుటుంబాలకు నూతన గృహాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా లక్ష గృహప్రవేశాలు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.అందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో 3,144 ఇళ్లను లబ్ధిదారులకు అందించడం ఎంతో సంతోషకరమన్నారు.అందరికీ ఇల్లు–సురక్షిత నివాసం అనే లక్ష్యంతో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు,సొంత గౌరవాన్ని అందించడమే ఈ ప్రభుత్వ ధ్యేయమన్నారు.ప్రభుత్వం తోడుగా ఉంటూ ప్రతి కుటుంబానికి శుభాభినందనలు తెలియజేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,లబ్ధిదారులు,గ్రామ పెద్దలు,గృహ నిర్మాణ శాఖ అధికారులు,భారీ సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.సొంత ఇంటి కల నెరవేరినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యే,ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## వడ్డెర కులస్తుల స్మశాన వాటికను రక్షించాలని జిల్లా కలెక్టర్‌కు వినతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 1(ప్రభాత ఉదయం)**

గద్వాల పట్టణం, సర్వే నంబర్ 702లో వందల సంవత్సరాలుగా వడ్డెర కులస్తులు వినియోగిస్తున్న స్మశాన వాటికను కుట్ర పూరితంగా రెవెన్యూ రికార్డుల నుండి తొలగించారని, తమ హక్కును కాలరాస్తున్నారని ఆరోపిస్తూ వడ్డెర సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం వందలాది మంది జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు.వడ్డెర సేవా సంఘం అధ్యక్షులు కె.గోపాల్ మాట్లాడుతూ మా పూర్వకాలం నుండి నల్లకుంట ప్రాంతం సర్వే నంబర్ 702లోని స్థలాన్ని స్మశానంగా వాడుతున్నాం అని, ప్రభుత్వమే 1987లో గుర్తించిన భూమిని ఇప్పుడు కబ్జా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. చావుకు కూడా కులం అడ్డొస్తోంది అని జిల్లా కలెక్టర్ తక్షణం విచారణ జరిపి, మా హక్కును కాపాడాలి అని అవసరమైతే మట్టి పరిశోధన జరిపించాలని" అని డిమాండ్ చేశారు.సర్వే నం. 702ను తిరిగి "వడ్డెర స్మశాన వాటిక"గా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలి అని, స్మశాన భూమికి హద్దులు ఏర్పాటు చేసి, ప్రహరీ నిర్మించాల అని, తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి అని, అంత్యక్రియలకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా చూడాలి అని తదితర డిమాండ్లతో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సేవా సంఘం నాయకులు రాధా కృష్ణ, నాగరాజు, మాజీ కౌన్సిలర్ పూడూర్ కృష్ణ, టి రామకృష్ణ, కొండాపురం వీరేష్, సలహాదారులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అక్రమ అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేటు పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

**గద్వాల జిల్లా ప్రతి, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

జిల్లాలో విద్య సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అక్రమ అడ్మిషన్లు తీసుకుంటున్నారని విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ...పాఠశాలలు అధికారికంగా ప్రారంభం కాకముందే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్ల పేరుతో తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తూ ముందస్తు అడ్మిషన్లు, ఫీజుల వసూళ్లు చేపడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాల్సిన పాఠశాలలు వ్యాపార ధోరణితో వ్యవహరించడం సరికాదు. అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులను మభ్యపెట్టడం, సీట్లు పరిమితంగా ఉన్నాయంటూ భయాందోళనలు సృష్టించడం, ముందుగానే ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేయడం వంటి చర్యలను అరికట్టాలన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ ఫీజుల వసూళ్లను నిలిపివేయాలని కోరారు.విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు.కార్యక్రమములో పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు హాలింపాష, యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్ పల్లి రంగస్వామి. పి వై ఈ జిల్లా అధ్యక్షులు. బిరెల్లి దానయ్య, తదితరులు పాలుగోన్నారు



## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 1 ( ప్రభాత ఉదయం)**



జూరాల ప్రాజెక్టు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్, తదితర పరిశీలించడానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 4న సీఎం రేవంత్ రెడ్డి ధరూరు మండలంలోని జూరాల ప్రాజెక్టు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్, తదితర పరిశీలించడానికి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, వనపర్తి ఎస్పీ సునీత రెడ్డితో కలిసి ప్రాజెక్టు తదితర పరిసర ప్రాంతాల్లో హెలిపాడ్ నిర్మాణం, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. జూరాల ప్రాజెక్టు సమీపంలోని రేవులపల్లి గ్రామం జెన్కో క్వార్టర్స్ లో, రామాలయం పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో, తదితర ప్రాంతాల్లో హెలిపాడ్ ఏర్పాటు చేసేందుకు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెలిపాడ్ నుంచి ఆయా ప్రాజెక్టును సందర్శించే దారిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీస్ బందోబస్తు నియమించాలన్నారు. రెండు రోజులే సమయం ఉండడంతో సీఎం పర్యటించే కాన్వాయ్ రహదారులను మరమ్మత్తు చేయించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ఉంటే సరి చేయించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అవసరమైన చోట బారికేడ్లతో పాటు ఇతర ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, డిఎస్పి మొగిలయ్య, ఇరిగేషన్ ఈఈ సంజీవ్ ప్రసాద్, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులున్నారు.



## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ముస్తాబు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం గద్వాల జిల్లా కలెక్టరేట్ తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి న్యూఢిల్లీ ఏపీ జితేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.ఈమేరకు సమీకృత కలెక్టరేట్, సభా వేదికలను విద్యుత్ దీపాలతో అలంకరించి అందంగా ముస్తాబు చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలిపేలా స్టాళ్ల ప్రదర్శన, విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించేందుకు ఏర్పాట్లు చేశారు.



## ఉప్పేరు హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో మొబైల్ దొంగతనం

### ఆచూకీ తెలిపిన వారికి 2 వేలు నగదు బహుమతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

ధరూర్ మండల పరిధిలోని ఉప్పేరు గ్రామం వద్ద గల హెచ్ పి పెట్రోల్ బంక్‌లో సోమవారం తెల్లవారుజామున మొబైల్ ఫోన్ దొంగతనం జరిగింది. పెట్రోల్ బంక్ యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం... సోమవారంతెల్లవారుజామున సుమారు 3:25 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి బంక్ వద్దకు వచ్చాడు. ఆ సమయంలో అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది గాఢ నిద్రలో ఉండటాన్ని ఆసరాగా చేసుకుని, సదరు గుర్తు తెలియని వ్యక్తి బంక్‌లో ఉన్న ఒక మొబైల్ ఫోన్‌ను దొంగిలించి అక్కడి నుండి వెంటనే పరారయ్యాడు.ఈ చోరీకి పాల్పడిన వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే లేదా అతని ఆచూకీకి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని పెట్రోల్ బంక్ యాజమాన్యం కోరుతోంది. దొంగను గుర్తించి అప్పగించిన వారికి లేదా అతడిని పట్టుకోవడానికి ఉపయోగపడే ఖచ్చితమైన సమాచారం అందించిన వారికి ₹2,000 (రెండు వేల రూపాయలు) నగదు బహుమతి అందజేయబడుతుందని వారు ప్రకటించారు. సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ నంబర్ 7386159555కు అందించాలని కోరారు




## అట్టహాసంగా ప్రారంభమైన బడిబాట

### ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ ప్రచారం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జాంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించాలన్న లక్ష్యంతో విద్యాశాఖ అధికారులు చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గద్వాల జిల్లాలో సోమవారం ప్రారంభమైంది. ఈ మేరకు ధరూర్ మండలం జాంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎం రేవతి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఐదేళ్ల పిల్లలున్నా, చదువు మానేసిన వారిని సర్కారు బడుల్లో చేర్పించాలంటూ తల్లిదండ్రులను కోరారు. ప్రతి విద్యార్థికి మంచి చదువు, ఏకరూప దుస్తులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని వివరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో, ఒత్తిడిలేని విద్యావిధానం, సాంస్కృతిక కార్యక్రమాలు,ఆటలు, పాటలతో సమాగ్రాభివృద్ధితో మీ పర్యవేక్షణ, మీ పాఠశాల, మీ గ్రామం, మీ పిల్లలకోసం మనం అందరం కలసి ముందుకు పోదాం అని తెలుపుతూ ప్రతిఇంటికి వెళ్లి బడిబాట కార్యక్రమం ఆవశ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సత్యమ్మ, మధ్యాహ్నభోజనం నిర్వాహకులు భీములమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అధిక వడ్డీ ఆశ చూపి.. పరారైన చిట్టీల వ్యాపారి

### సుమారు రూ.10 కోట్లతో ఉడాయించిన నిర్వాహకుడు

### జిల్లా ఎస్పీని ఆశ్రయించిన బాధితులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 1 (ప్రభాత ఉదయం)**

చిట్టీలు వేయించుకుని ఓ వ్యక్తి డబ్బులు ఇవ్వకుండా పరారైన ఘటన గద్వాల జిల్లా బిజ్వారంలో చోటు చేసుకుంది.చాలా మంది చిరుద్యోగులు పైసా పైసా కూడబెట్టి చిట్టీలు కడుతుంటారు. అలా కట్టిన డబ్బులతో వారు ఇంటి అవసరాలను తీర్చుకుంటుంటారు. ఇలా చిట్టీలు కట్టిన సభ్యులను నిండా ముంచి ఓ నిర్వాహకుడు పరారయ్యాడు. ఏకంగా రూ.10 కోట్లకు పైగా సొమ్ము చెల్లించకుండా ఉడాయించాడు. బాధితులు అతడి ఇంటి వద్దకు వెళ్లి లబోదిబోమంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన తంబలి కృష్ణయ్య అనే వ్యక్తి గత కొంతకాలంగా చిట్టీలు కట్టించుకుంటూ నమ్మకంగా ఉన్నాడు. అనుకున్న సమయానికి సొమ్ము తిరిగి చెల్లిస్తాడనే గుర్తింపు రావడంతో అతడిపై జనాలకు నమ్మకం ఏర్పడింది. దీంతో పెద్దసంఖ్యలోనే అతడి వద్ద చిట్టీలు వేసేవారు. క్రమక్రమంగా అతని చిట్టీల వ్యాపారం మల్దకల్, ధరూర్, గట్టు, అయిజ మండలాలతో పాటు, గద్వాల పట్టణానికి విస్తరించింది. చిట్టీలు పాడుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా అధిక వడ్డీ ఆశ చూపి తన వద్దే ఉంచుకునేవాడు. మళ్లీ అదే సభ్యులతో చిట్టీలు వేయించేవాడు. ఇదే సమయంలో తనకు పరిచయం ఉన్నవారితో, సన్నిహితులతో అధిక వడ్డీలు ఆశ చూపి పెద్ద మొత్తంలో వడ్డీలు తీసుకున్నాడు. మొదట్లో తాను ప్రజల నుంచి తీసుకున్న నగదుకు వడ్డీతో సహా సక్రమంగా చెల్లించడంతో నమ్మకం ఏర్పడి సుమారు వంద మంది వరకు బాధితులు ఒకరికి తెలియకుండా ఒకరు అతడికి అప్పు ఇచ్చారు. ఇలా రూ.10 కోట్లకు పైగా వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. చిట్టీ గడువు ముగిసిన తరువాత కూడా వారికి డబ్బులు తిరిగి ఇవ్వకపోగా, చెక్కులు, ప్రామిసరీ నోట్లు ఇచ్చి కాలయాపన చేస్తున్నారని బాధితులు పేర్కొన్నారు. మరికొందరు కూడా ఇలాగే మోసపోయారని, మొత్తం వ్యవహారంలో దాదాపు రూ.10 కోట్లు వరకు మోసం చేశారని బాధితులు చెబుతున్నారు. గత వారం రోజుల నుంచి చిట్టీల నిర్వాహకుడు గ్రామం వదిలి వెళ్లినట్టుగా తెలియడంతో పోలీసులను ఆశ్రయించే ప్రయత్నంలో బాధితులు ఉన్నారు. సోమవారం బాధితులు జిల్లా ఎస్పీని ఆశ్రయించినట్లు తెలిసింది.. కాగ దీనిపై మల్దకల్ ఎస్సై శ్రీహరి వివరణ కోరగా చిట్టీల వ్యాపారి నుంచి మోసపోయామంటూ బాధితులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు.